క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: పట్టణంలో వేంచేసి ఉన్న మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముని ఆశీస్సులు అందరిపై ఉండాలి



పందిరి రాట ముహూర్తం చేస్తున్న మహిళలు

పెద్దాపురం: అందరిపై శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శ్రీరామ్ నగర్ నాయీ బ్రాహ్మణ కాలనీలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక మహిళలు పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాలనీ పెద్దలు మాట్లాడుతూ, శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాముల వారి కల్యాణ మహోత్సవానికి సహకరించాలని కోరారు.

నాలుగు సర్క్యులేషన్ ప్యాట్రన్ల ప్రకటన



పట్టణంలో సర్క్యులేషన్ ప్యాట్రన్లను ప్రకటిస్తున్న అధికారులు

సామర్లకోట: మున్సిపాలిటీలో 15 ఇరుకైన ప్రాంతాలను (సర్క్యులేషన్ ప్యాట్రన్స్)ను గుర్తించామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ మేరకు నాలుగు ప్యాట్రన్స్‌ను శుక్రవారం ప్రకటించినట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రోడ్ల మేరకే విస్తరణ జరుగుతుందని, తద్వారా స్థలాన్ని కోల్పోయే అవకాశం లేదన్నారు. దాంతో తక్కువ స్థలం ఉన్నవారు ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్ల మంజూరుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు జరగని స్థలాల్లో అల్లంవారి వీధి, గోలివారి వీధి, బలుసులపేట, బల్ల మార్కెట్ ఏరియాల్లో సర్క్యులేషన్ ప్యాట్రన్స్ ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే వారం లోగా తెలియజేయాలని సూచించారు. మిగిలినవి త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ అధికారి మంజుల, సచివాలయాల టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

అఖిల భారత మహాసభలకు సీపీఎం నేతలు



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సీపీఎం నాయకులు

సామర్లకోట: మధురైలో జరగనున్న సీపీఎం అఖిల భారత మహాసభలకు నియోజకవర్గ నాయకులు శుక్రవారం సాయంత్రం సామర్లకోట నుంచి బయలుదేరారు. ఈ నెల 6న భారీఎత్తున నిర్వహిస్తున్న ఈ సభలకు పెద్దాపురం, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. జిల్లా నాయకులు డి.క్రాంతికుమార్, డి.రాజు, రమేష్, నియోజకవర్గ ప్రతినిధులు బాలం హరిబాబు, సత్తిబాబు, జగదీష్ అరుణ్, పీడీ ప్రసాద్ తదితరులు సామర్లకోట నుంచి పయనమయ్యారు.

జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

పిఠాపురం: మండలంలోని పి.రాయవరంలో శ్రీసీతారామాలయం పునర్నిర్మాణ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఐదో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొంటున్నారు. తొలిరోజు కాకినాడకు చెందిన శ్రీసాయి కార్తీక్ క్రియేషన్స్ వారి ఎడారిలో వాన చినుకు, శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ చిన తిరుపతికి చెందిన కళాకారుల కబ్జా నాటిక ప్రదర్శించారు. శుక్రవారం విశాఖపట్నానికి చెందిన తెలుగు కళా సమితి వారి నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కొండెవరానికి చెందిన శ్రీమణికంఠ ఆర్ట్స్ కళాకారులు నటించిన కొత్తతరం కొడుకులు అనే నాటికలు ప్రదర్శితమయ్యాయి.

ప్రకృతి పాపాయి.. సేంద్రియ బొప్పాయి

- గణనీయంగా పెరిగిన డిమాండ్
- నియోజకవర్గంలో పంట సాగులో వృద్ధి
- లాభాలు పెరిగాయంటున్న రైతులు

పిఠాపురం: మార్కెట్ అవకాశాలు మెండుగా ఉండి, ఏటా సాగు విస్తీర్ణాన్ని పెంచుకుంటున్న పండ్ల తోట బొప్పాయి. ఒకప్పుడు ఏ ఇంటి పెరట్లో చూసినా బొప్పాయి చెట్లు ఉండేవి. కరోనా తరువాత దీనికి డిమాండ్ పెరగడంతో ఇప్పుడు బొప్పాయి పంట అధిక దిగుబడిని, ఆకర్షణీయమైన పండ్లను ఇచ్చే రకాలు అందుబాటులోకి రావడంతో పొలాల్లో, తోటలుగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఒకసారి నాటితే రెండేళ్ల పాటు నిరంతరాయంగా పంట దిగుబడినిచ్చే అవకాశం ఉండడంతో ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వంద టన్నుల పైగా..

ఎకరాకు వంద టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, సేంద్రీయ పద్ధతులు, సస్యరక్షణా చర్యలు తీసుకోవడంతో దిగుబడులు మరింత పెరిగాయంటున్నారు రైతులు. ఇతర పండ్లతో పోలిస్తే బొప్పాయిలో కెరోటిన్ అత్యధికంగా ఉంటుంది. విటమిన్లు పుష్కలంగా లభ్యం కావడం, ఆరోగ్యానికి మేలు చేసే వివిధ ఔషధ గుణాలు మెండుగా ఉండడంతో దీని వినియోగం నానాటికీ పెరుగుతోంది. కరోనా వచ్చిన నాటి నుంచి దీని వినియోగం మరింత పెరిగింది. బొప్పాయి ఉష్ణ మండల పంట. 35 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య ఈ చెట్లు బాగా పెరుగుతాయి. నీరు నిల్వ ఉండని ఎర్ర నేలలు, తేలిక పాటి నల్ల రేగడి నేలలు దీని సాగుకు బాగా అనుకూలం.

ఏడాది పొడవునా..

మురుగు నీటి సౌకర్యం ఉండి, నీటి వసతి కలిగి ఉంటే బొప్పాయిని ఏడాది పొడవునా ఏ సమయంలోనైనా నాటుకోవచ్చు. ఉదజని సూచిక 6.5–7 ఉన్న నేలలు అనుకూలంగా ఉంటాయంటున్నారు వ్యవసాయ నిపుణులు. మెట్ట ప్రాంతాలైన పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల్లో ఈ పంట సాగు ఏటా పెరుగుతోంది. తెగుళ్లు, వైరస్‌లు పంటను కొంత ఇబ్బంది పెడుతున్నప్పటికీ, ఉద్యాన శాఖ, ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు వాటిని అధిగమించి మంచి లాభాలు పొందుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో వీటి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. నియోజకవర్గంలో సుమారు 500 ఎకరాల్లో బొప్పాయి సాగు చేపట్టగా, వీటిలో 300 ఎకరాల వరకు సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

సేంద్రియ బొప్పాయికి డిమాండ్

రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పంట కంటే, సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన బొప్పాయికి మంచి డిమాండ్ ఉంటోందని రైతులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ, తాటిపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సేంద్రియ పద్ధతిలో బొప్పాయి సాగు చేపట్టారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పంటలు తెగుళ్ల సోకి, కాయ నాణ్యత దెబ్బ తినడంతో నష్టాలు చూశామని, ఇప్పుడు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలో నష్టాలు లేకుండా లాభాలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గొల్లప్రోలు మండలంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన బొప్పాయి తోట



బొప్పాయి పండ్లు

పెరిగిన దిగుబడి

ఇప్పటి వరకు రసాయన ఎరువులు, పురుగు మందులతో బొప్పాయి సాగు చేసే వాడిని. పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వచ్చేది. ఎంత పండినా లాభాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇప్పుడు సేంద్రియ పద్ధతిలో బొప్పాయి సాగు చేస్తున్నాను. 1.70 ఎకరాల్లో బొప్పాయి సాగు చేయగా, ఇప్పటి వరకు రూ.10 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. టన్ను రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు అమ్ముతున్నాం. ప్రస్తుతం పెట్టుబడి సగానికి సగం తగ్గింది. తెగుళ్ల అంతగా లేకపోవడంతో దిగుబడి బాగుంది. లాభాలు బాగానే వస్తున్నాయి. ఎక్కువగా సేంద్రియ పద్ధతిలో పండించిన బొప్పాయికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో మంచి లాభాలు వస్తున్నాయి.

– వెలుగుల శ్రీను, బొప్పాయి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

రైతులు ఆసక్తి చూపుతున్నారు

సేంద్రియ పద్ధతిలో బొప్పాయి సాగును పెంచే విధంగా ప్రకృతి వ్యవసాయ శాఖ కృషి చేస్తోంది. దుర్గాడలో సేంద్రియ సాగు పెరగడంతో, దానిలో బొప్పాయి కూడా పెరిగింది. ఎక్కువ మంది రైతులకు అవగాహన కల్పించి సేంద్రియ సాగుకు సన్నద్ధం చేయడంతో, ఈ ఏడాది బొప్పాయి సాగు ఆశాజనకంగా ఉంది. సేంద్రియ సాగుకు ఎప్పుడూ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. పెట్టుబడి తగ్గడంతో పాటు, లాభాలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు బొప్పాయి సాగును సేంద్రియ పద్ధతిలో చేస్తున్నారు.

– గుండ్ర శివచక్రం, నిర్వాహకుడు, గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణా కేంద్రం

ఎట్టకేలకు చలివేంద్రంలో మంచినీరు



మున్సిపల్ కార్యాలయం వద్ద చలివేంద్రంలో మంచినీరు తాగుతున్న యువకులు

సాక్షి ఇంపాక్ట్

పెద్దాపురం: మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఎట్టకేలకు శుక్రవారం మజ్జిగ, మంచినీటి ఏర్పాట్లు చేశారు. ‘సాక్షి’లో ‘ఆర్భాట వేంద్రం’ పేరిట ప్రచురితమైన వార్తకు మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. ఉదయం పది గంటల నుంచి మంచినీటితో పాటు, మజ్జిగ పంపిణీని చలివేంద్రంలో ఏర్పాటు చేయగా, స్థానిక ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. మున్సిపల్ సెంటర్ ప్రధాన కూడలి కావడంతో స్థానికులు అధిక సంఖ్యలో చలివేంద్రం సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందిపై కేసులు

సామర్లకోట: మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో శుక్రవారం 12 మందిని కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ కె.కృష్ణభగవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగురికి రెండు రోజుల జైలు, ఐదుగురికి రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి తీర్పు ఇచ్చారన్నారు.

ఘనంగా వసంత నవరాత్ర పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో వసంత నవరాత్ర పూజలు చేస్తున్న పండితులు



ప్రత్యేకాలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాల కార్యక్రమాలు జరిగాయి. పండితులు అల్లికి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి చంటి, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

గ్రామ కంఠంలో ఇళ్లకు పట్టాలు



గ్రామ కంఠంలో నిర్మించిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: అభ్యంతరం లేని స్థలాలు, ముఖ్యంగా గ్రామకంఠంలో ఏ విధమైన హక్కు పత్రాలు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు మంజూరు చేస్తున్నట్లు తహసీల్దార్ జి.చిన్నారావు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి మండలంలో గ్రామ కంఠాల్లో నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, జీఓఎంఎస్ 30 ద్వారా ఈ పట్టాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ కంఠంలో ఇళ్లు నిర్మించుకున్న వారు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి, ఈ నెల పది లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యూనిట్ల ఎంపికలో గందరగోళం



సామర్లకోట టీటీడీసీలో నిర్వహించిన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన

సామర్లకోట: బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యూనిట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం జరిగింది. స్టేట్‌బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూబీఐ, డీసీసీబీ అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు స్థానిక టీటీడీసీలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. నాలుగు రూముల్లో ఒకేసారి అభ్యర్థులు తరలిరావడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. వరుస క్రమంలో పిలవకపోవడంతో, అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు సుమారు 820 దరఖాస్తులు రాగా, 700 మంది అభ్యర్థులు హాజరయ్యారని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రస్తుతం 30 యూనిట్లు ఉన్నాయన్నారు. అర్హత కలిగి, మిగిలిపోయిన అభ్యర్థులకు వచ్చే ఏడాదిలో రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మంగాలక్ష్మి



పెద్దాపురం: కొత్తగా పెద్దాపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నూనె మంగాలక్ష్మి నియమితులయ్యారు. శుక్రవారం ప్రకటించిన ఏఎంసీ నియామకాల్లో భాగంగా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పట్టణ థీమ్ ప్రారంభం



థీమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెద్దాపురం: పట్టణంలోని గుర్రాల సెంటర్‌లోని ఏర్పాటు చేసిన ఐ లవ్ పెద్దాపురం థీమ్‌ను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ పద్మావతి, డీఈ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభించిన నాగబాబు



ముఖాముఖి నిర్వహిస్తున్న నాగబాబు

పిఠాపురం: నియోజకవర్గంలో అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో సీఎస్సార్ నిధులు రూ.88.98 లక్షలతో నిర్మించిన పట్టణ పీహెచ్‌సీని శుక్రవారం ప్రారంభించారు. శాసన మండలి ప్రభుత్వ విప్ హరిప్రసాద్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, కాడా చైర్మన్ తుమ్మల రామస్వామి, పాడా పీఓ చైత్రవర్షిణి, డీఎంహెచ్‌ఓ డా.జె.నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో స్థానికులతో నాగబాబు ముఖాముఖి నిర్వహించారు. ఇటీవల టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ జగ్గయ్య చెరువు కాలనీలో పర్యటించి, అక్కడి సమస్యలపై కలెక్టరుకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నాగబాబు ముఖాముఖి ప్రాధాన్యం సంతరించుకుంది.

అప్పట్లో ఎకరానికి ఐదు సెంట్ల తేడా

- రీ సర్వేపై తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి
- పైలట్ ప్రాజెక్టు వేట్లపాలెంలో పూర్తి



రైతుల సమస్యలు ఆలకిస్తున్న తహసీల్దార్

సామర్లకోట: కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన రీ సర్వేలో ఎకరం భూమికి ఐదు సెంట్ల వరకు తేడాను ఆమోదించినట్టు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఆ మేరకు సర్వేను తప్పుపట్టాల్సిన అవసరం లేదని చెప్పారు. ఐదు సెంట్లకు మించి భూమిలో తేడా ఉన్నా, సర్వే నంబరులో తేడా ఉన్నా, పేర్లు తేడా ఉన్నా రైతులు అభ్యంతరాలను తెలియజేయవచ్చని స్పష్టం చేశారు. మండలంలోని వేట్లపాలెం గ్రామాన్ని రీ సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ఇక్కడి రీ సర్వే విజయవంతమైందని ప్రకటించారు. వేట్లపాలెం రైస్ మిలర్ల అసోసియేషన్ భవనంలో శుక్రవారం జరిగిన రీ సర్వే అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రస్తుత రీ సర్వే అధునాతన రోవర్స్ వంటి పరికరాలతో కొలతలు తీస్తున్నట్టు చెప్పారు. వంద ఎకరాల ప్లాటు అయినప్పటికీ, 20 సెం.మీ. కంటే వత్యాసం వచ్చే అవకాశం లేదన్నారు. దాంతో రీ సర్వేలో భూమి స్థితి యధాతథంగా నిర్ధారిస్తారని వివరించారు.

అప్పట్లో 17 ఏళ్లు

వందేళ్ల క్రితం 1916లో రీ సర్వే ప్రారంభించి 1933లో పూర్తి చేసినట్టు తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అప్పటి నుంచి రీ సర్వే జరగకపోవడంతో, ప్రస్తుతం భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో రీ సర్వే చేస్తున్నట్టు చెప్పారు. అప్పట్లో జరిగిన సర్వే వంద లింకులతో కూడిన 20 మీటర్ల పొడవైన గొలుసుతో మాన్యువల్‌గా భూమిని కొలిచేవారన్నారు. ఆ సమయంలో గొలుసు సాగిపోవడం, లింకులు తెగిపోవడం వంటి కారణాలతో కొలతల్లో తేడాలు ఉండే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అప్పట్లో ఎకరానికి ఐదు సెంట్ల వరకు మినహాయింపు ఇచ్చినట్టు వివరించారు.

అభ్యంతరాలు చెప్పవచ్చు

రీ సర్వేలో రైతుల భూములకు సంబంధించిన వివరాలను ప్రతి సచివాలయ పరిధిలోను, తహసీల్దార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. 15 రోజుల్లోపు రైతులు అభ్యంతరాలను తెలియజేస్తే, వాటిని నివృత్తి చేసి.. వారి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. రైతుల అభ్యంతరాలు లేని పక్షంలో వారి భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రీ సర్వేకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తారన్నారు. వేట్లపాలెం గ్రామంలో మూడు నెలల పాటు 50 మంది సర్వేయర్లు, 25 మంది వీఆర్వోలతో రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయడానికి రైతులు సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, డిప్యూటీ సర్వేయర్ కె.అప్పారావు, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

వేసవి షాక్

- లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ముప్పు
- షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలకు నష్టం
- సరఫరాలో లోపాలుంటే ఫిర్యాదు చేయాల్సిందే..



ట్రాన్స్‌ఫార్మర్‌తో ఉన్న స్తంభం



ఇళ్ల మధ్య అపాయకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాకినాడ సిటీ: వేసవి వచ్చిందంటే ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగం అధికమవుతుంది. ఇంత వరకు బాగానే ఉన్నా విద్యుత్ వినియోగంలో వైర్ల సామర్థ్యంపై సందేహాలు అన్నీఇన్నీ కావు. కన్‌సీల్డ్ వైరింగా, గోడలపైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా? అనేది గుర్తించాల్సిన విషయం. వైరింగ్‌లో లోపాలుంటే షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

అధిక లోడుతో అనర్థమే..

వేసవిలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కోసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కానీ, కార్యాలయాల్లో కానీ విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను విద్యుత్ విభాగం వారి అనుమతి తీసుకోవాలి. సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి లోడ్ సామర్థ్యం మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతారు. కేవలం 1 కేవీ లోడుకు అనుమతి పొంది, వేసవి తీవ్రత దృష్ట్యా అంతకంటే అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి, దెబ్బతినే అవకాశం ఉంది. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులుంటే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి.

కాకినాడలో విద్యుత్ వ్యవస్థ ఇలా..

కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో 9 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కాకినాడ నగరంలో కుళాయి చెరువు వద్ద డీ1 సబ్‌స్టేషన్, జగన్నాథపురం బాలయోగి బొమ్మ వెనుక డీ2, సాంబమూర్తినగర్ ఐదో వీధిలో డీ3, రమణయ్యపేట కాలువ గట్టు వద్ద డీ4, పాత పోర్టు రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో డీ5, ప్రతాప్‌నగర్‌లో డీ6, డెయిరీ ఫారం సెంటర్ వద్ద డీ7, జేఎన్‌టీయూకే వద్ద డీ8, బీచ్ రోడ్డు ప్రాంతంలో డీ9 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు వాకలపూడి వద్ద ఒక సబ్‌స్టేషన్, ఏడీబీ రోడ్డులో పవర్‌హౌస్‌లు ఉన్నాయి. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 2.32 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులున్నారు.

అప్రమత్తత అవసరం

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా సిబ్బందికి తెలియజేయాలి.

– ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ

విద్యుత్ సంబంధిత ప్రమాదాలకు అత్యవసర నం: 1912

ఇలా చేయవద్దు

- గృహాల్లో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ భారం పడే పరికరాలు వినియోగిస్తే వైర్లు కాలిపోయే ప్రమాదముంది.
- ఒక స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే లోడ్ పెరిగి, స్పార్క్ ఏర్పడి ప్రమాదాలు జరగవచ్చు.
- ఎండలో విద్యుత్ తీగలు ఉంటే, కాలక్రమేణా తీగలపై రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు ఉత్పన్నం కావచ్చు.
- ఇంట్లో విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఒకేసారి ఆన్ చేసి ఉంచవద్దు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందరవందరగా ఉంచరాదు.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ (మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవి ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ఇళ్లు, కార్యాలయాల్లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించాలి.
- వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
- ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్ విభాగం నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- అందుకు తగ్గట్టుగా వైరింగ్ చేశాక ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఓవెన్, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
- నాసిరకం పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, వైరింగ్ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.
- విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకుండే సర్వీస్ వైర్లు అతుకుల్లేకుండా చూసుకోవాలి.